15 DEC 2019

# యానాం న్యూస్

## నిరాశ్రయులకు స్వెట్టర్ల పంపిణీ

**గోపాల్‌నగర్ (యానాం)డిసెంబరు 14:** ఫుట్‌పాత్‌లపై చలిలో ఉంటున్న పలువురు నిరాశ్రయులకు గోపాల్‌నగర్‌లోని హోలిగాడ్ ప్రేయర్ టవర్ చర్చ్ ప్రతినిధులు స్వెట్టర్లు పంపిణీ చేశారు.హోలిగాడ్ ప్రేయర్ టవర్ చర్చ్ వార్షికోత్సవం సందర్భంగా పలు సేవకార్యక్రమలు నిర్వహిస్తున్నారు. యానాం క్రిస్టియన్ డెవలప్‌మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు, రెవరెండ్ బి.సుధాకర్ నేతృత్వంలో కుటుంబ సభ్యులు యానాం, కాకినాడలోని ఫుట్‌పాత్‌లపై చలిలో ఉంటున్న నిరాశ్రయులకు స్వెట్టర్లు పంపిణీ చేశారు.



**నిరాశ్రయులకు స్వెట్టర్లు పంపిణీ చేస్తున్న చర్చ్ ప్రతినిధి**

## 30 నుంచి యానాంలో ఫల, పుష్ప ప్రదర్శన

**యానాం, డిసెంబరు 14:** కేంద్ర పాలిత ప్రాంతమైన యానాం నియోజకవర్గంలో ప్రతీ ఏటా నిర్వహిస్తున్న ఫల పుష్ప ప్రదర్శన పురస్కరించుకుని పలు పోటీలను నిర్వహించనున్నట్లు ఫ్లవర్‌షో కమిటీ ఛైర్మన్, పరిపాలనాధికారి శివరాజ్‌మీనా తెలిపా రు. పెరటి తోటలు పెంకం-గ్రామీణ, పట్టణ విభాగాల్లో ఉద్యానాల పెంపకం, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలు ఒక కేటగిరీలో, జనరల్, గ్రామీణ, పట్టణ ప్రాంతం ఒక విభాగంలో నిర్వహిస్తామన్నారు.రంగోలి పోటీలు మహిళలు 8,9,10 తరగతులు, కళాశాల విద్యార్థి నులకు ఈనెల 30న ఉదయం 8 గంటలకు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణం లో, వంటల పోటీలు చిరుధాన్యాలు, పప్పు, నూనె వంటలు, పళ్లు, కూరగాయలు వం టలు విభాగాల్లో జనవరి 6న జీఎంసీ బాలయోగి స్టేడియంలో ఉదయం 10 గంటలకు నిర్వహిస్తామన్నారు. వివిధ రకాల పూలమొక్కలు, పుష్పాలంకరణ, వివిధ రకాల ఫలాలు, అరటి గెలలు, కొబ్బరి గెలలు, గుమ్మడి, ఆకులు, బూడిద గుమ్మడి, ఇతర కూరగాయల ప్రదర్శన పోటీలు నిర్వహిస్తామని వివరించారు. దరఖాస్తులు ఈ నెల 21వ తేదీలోగా వ్యవసాయ శాఖ కార్యాలయంలో అందజేయాలన్నారు.

## 11న నవోదయ 6వతరగతి ప్రవేశ పరీక్ష నిర్వహణ

**మెట్టకుర్రు(యానాం)డిసెంబరు 14:** స్థానిక మెట్టకూరులోని జవహర్ నవోదయ విద్యాలయంలో 6వతరగతి ప్రవేశ పరీక్ష జనవరి 11న నిర్వహించనున్నామని ప్రిన్సిపాల్ ఎం.అనురాధ తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు హాల్‌టిక్కెట్‌ను ఆన్‌లైన్ ద్వారా డౌన్లోడు చేసుకోవచ్చాని, జవహర్ నవోదయ విద్యాలయ హెల్ప్‌డెస్కె ద్వారా దరఖాస్తు చేసినవారు నేరుగాను, ఆన్‌లైన్ హాల్‌టికెట్‌లో ఏవైనా తప్పులు ఉన్నచో సరియైన ఆధారాలతో మెట్టకూరులోగల జవహర్ నవోదయ విద్యాలయంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సంప్రదించాలని సూచించారు. ఈఅవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

15 DEC 2019

## పాలనలో బేడీ జోక్యం కేసులో వాదనలు పూర్తి

**యానాం, న్యూస్‌టుడే:** పుదుచ్చేరి ప్రభుత్వ పాలనలో లెఫ్టినెంట్ గవర్నర్ అపరిమితంగా జోక్యం చేసుకోవడం రాజ్యాంగ సూత్రాలు ప్రకారం సరికాదంటూ మద్రాస్ హైకోర్టు ఈ ఏడాది ఏప్రిల్ చివర్లో జారీ చేసిన ఆదేశాలపై ఇరుపక్షాలు చేసిన వాదనలు పూర్తయ్యాయి. దీనితో తీర్పును మద్రాస్ హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం రిజర్వ్‌లో పెట్టింది. పుదుచ్చేరి ఎల్‌జీగా బాధ్యతలు చేపట్టింది మొదలు కిరణ్‌బేడీ వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసి అధికారులకు తానే ఆదేశాలు జారీచేయడం, వారితో సమీక్షలు నిర్వహించడం, పాలనలో ప్రత్యక్షంగా జోక్యం చేసుకోవడంతో ఇక ప్రజాప్రభుత్వం పాత్రేమిటో తేల్చాలంటూ ఎమ్మెల్యే కె.లక్ష్మీనారాయణ మద్రాస్ హైకోర్టులో కేసు దాఖలు చేసిన విషయం తెలిసిందే. బేడీకి మరికొన్ని అధికారాలు సంక్రమింపజేస్తూ కేంద్రహోంశాఖ జారీ చేసిన ఉత్తర్వులను ఆయన తన పిటీషన్‌లో సవాల్ చేశారు. హైకోర్టు న్యాయమూర్తి కేసును విచారించి పాలనా వ్యవహారాల్లో కిరణ్‌బేడీ జోక్యం చేసుకోవడం రాజ్యాంగ విరుద్ధమని, పాలన నిర్వహణ బాధ్యత పూర్తిగా ప్రభుత్వానిదేనంటూ తీర్పు ఇచ్చారు. దీనిపై కేంద్రహోంశాఖ, కిరణ్‌బేడీ సుప్రీంకోర్టును ఆశ్రయించగా మద్రాస్ హైకోర్టు వేరేబెంచ్‌కు వెళ్లమంటూ ప్రధాన న్యాయమూర్తి ఆదేశించారు. మళ్లీ మద్రాస్ హైకోర్టును హోంశాఖ, బేడీ బృందం జూన్‌లో ఆశ్రయించారు. ఏడు నెలల్లో పలు దఫాల వాదనల అనంతరం శుక్రవారం ఇరువర్గాల మధ్య తుది వాదనలు జరిగాయి. హోంశాఖ, బేడీల తరపున అదనపు సోలిసిటర్ జనరల్ అమన్ లేఖి, అరవింద్ దాతర్, ఎల్.వి.సోమయాజులు, ఎమ్మెల్యే లక్ష్మీనారాయణ తరపున సీనియర్ న్యాయవాదులు జి.మాసిలామణి, వీటీ గోపాలన్ వాదించారు. వీరి వాదనలు విన్న ప్రధాన న్యాయమూర్తి ఏపీ సాహిం, సుబ్రహ్మణ్యప్రసాద్ తీర్పును రిజర్వ్‌లో పెట్టారు.

## బీట్ ఆఫీసర్లు ప్రజలకు మరింత దగ్గరవ్వాలి

**యానాం, న్యూస్‌టుడే:** నేరాలను నిరోధించేందుకు బీట్ ఆఫీసర్ వ్యవస్థ దోహదపడుతుందని, బీట్ ఆఫీసర్లు ప్రజల నుంచి ఇందుకు తగిన సమాచారాన్ని రాబట్టాలని లెఫ్టినెంట్ గవర్నర్ కిరణ్‌బేడీ సూచించారు. పాండిచ్చేరి యూనివర్శిటీ సమావేశ మందిరంలో పోలీసు అధికారులతో శనివారం సమావేశం నిర్వహించి, కారైకాల్, మాహే, యానాం ప్రాంతాల పోలీసులతో దూరదృశ్య విధానంలో ఆమె మాట్లాడారు. బీట్ ఆఫీసర్ల సంఖ్యను 149 మంది 761కి పెంచామని, వీరంతా రోజూ ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కారంలో ముఖ్యభూమిక పోషించాలన్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అశ్విన్‌కుమార్, డీజీపీ సుబ్రహ్మణ్య శ్రీవాత్సవ, తదితరులు పాల్గొన్నారు.

15 DEC 2019

# విద్యార్థులకు ఎయిడ్స్ పై అవగాహన



యానాం /టుడేన్యూస్: స్థానిక ఎస్ టి పి పి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మదర్ తెరిస్సా ప్రభుత్వ నర్సింగ్ కళాశాల అధ్యాపక బృందం ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ కనకాల శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ చింతపల్లి కృష్ణ సుధాకర్‌లు మాట్లాడుతూ ఎయిడ్స్ అనేది మనుషుల్లో అవగాహన లేక రావడం జరుగుతుందని, ఇంకా అనేక రకాలుగా ఈ వ్యాధి వ్యాపిస్తుందని విద్యార్థులకు అవగాహన కల్పించారు. అదేవిధంగా ఎయిడ్స్ రోగులకు ఆహారము వారిని దూరంగా పెట్టకుండా ప్రేమతో చూడాలని, అంటురోగం కాదని తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జి రత్నప్రభ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ భాను ప్రసాద్ అధ్యాపక బృందం, నర్సింగ్ కళాశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

# సమస్యలపై గవర్నర్ వీడియో కాన్ఫరెన్స్

యానాం /టుడేన్యూస్: పుదుచ్చేరి వ్యాప్తంగా గల నాలుగు ప్రాంతాల్లోనూ అధికారులు తో లెఫ్టినెంట్ గవర్నర్ కిరణ్ బేడీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్థానిక ప్రాంతీయ పరిపాలనాధికారి కార్యాలయంలో యానాం అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సంబంధిత శాఖ సమస్యలు, అభివృద్ధి పనులపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో పరిపాలనాధికారి శివరాజ్ మీనా, మున్సిపల్ కమిషనర్ జి గౌరీ సరోజ, ప్రభుత్వ ఆసుపత్రి డిప్యూటీ డైరెక్టర్ కాశి సత్యనారాయణ, ఎస్ ఐ సేరు నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

15 DEC 2019

# ఆడపిల్లల సంరక్షణ అందరి ధ్యేయం కావాలి

## ..విద్యార్థులచే బేటీ బచావో బేటీ పడావో ర్యాలీ

**యానాం, ప్రభన్యూస్ :** సమజాంలో ఆడపిల్లల సంరక్షణ అందరి ధ్యేయం కావాలని సర్వశిక్షా అభియాన్ ఎడిపిసి కమిడి ప్రభాకర్ పేర్కొన్నారు. శనివారం విద్యాశాఖ ఆద్వర్యంలో ఇందిరాగాంధీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, కెఎన్జి ప్రభుత్వ బాలికల పాఠశాల విద్యార్థిని , విద్యార్థులు బేటీబచావో బేటీపడావో ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడపిల్లలు లింగవివక్షతను ఎదుర్కొంటున్నారని ముఖ్యంగా తల్లిదండ్రులు వారిపై వివక్షత చూపకుండా వారి విద్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు . నియోజకవర్గ పరిధిలో ఆడపిల్లలు శాతం తగ్గుతుందని ఆవిధంగా లింగనిష్పత్తిలో తేడాలు వస్తున్నాయని ఈ నేపధ్యంలో ప్రజలను చైతన్యవంతులను చేయాలనే లక్ష్యంతో బేటీబచావో బేటీ పడావో కార్యక్రమాలును విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం పాఠశాల ఆవరణలో ఆడపిల్లలను కాపాడాలంటూ మానవహారంను నిర్వహించారు. అంతకుముందుయానాం పట్టణ వీధుల్లో భారీ ర్యాలీని నిర్వహించారు . ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బి. సాయిజానకి , పి సత్యనారాయణ, టీచర్ బొబ్బిలి బాబి తదితరులు పాల్గొన్నారు.

15 DEC 2019

# ఆడపిల్లల సంరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి - యానాం

సమాజంలో ఆడపిల్లల సంరక్షణ అందరి బాధ్యతగా తీసుకోవాలని సర్వ శిక్షాభియాన్ ఎడిపిసి కమిడి ప్రభాకర్ పేర్కొన్నారు . శనివారం విద్యాశాఖ ఆధ్వర్యాన ఇందిరా గాంధీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, కెఎన్‌జి ప్రభుత్వ బాలికల పాఠశాల విద్యార్థులు భేటీ బచావో భేటీ పడావో ర్యాలీని నిర్వహించారు. తొలుత యానాం పట్టణ వీధుల్లో భారీర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం బి.సాయిజానకి, పి.సత్యనారాయణ, టీచర్ బొబ్బిలి జాలి పాల్గొన్నారు .